



## రూపీ హై జంప్

### 27 పైసలు పెరిగిన విలువ

ముంబై, డిసెంబర్ 15: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ శుక్రవారం భారీగా కోలుకున్నది. దేశీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన రికార్డు స్థాయి లాభాలు, విదేశీ మదుపరుల నుంచి కొనసాగుతున్న పెట్టుబడులు, ఇతరత్రా ఫారిన్ ఫండ్స్‌తో ఫారెక్స్ మార్కెట్‌లో రూపీ ఆకర్షణీయంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఒక్కరోజే ఏకంగా 27 పైసలు ఎగిసి 83.03 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్లలో సాగుతున్న విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు.. రూపీ సెంటిమెంట్‌ను బలపర్చాయని ఫారెక్స్ డీలర్లు చెప్తున్నారు. కాగా, ఉదయం ఆరంభంలో 83.30 వద్ద మొదలైన రూపాయి మారకం విలువ.. ఒక దశలో 83.32 స్థాయికి నష్టపోయింది. అలాగే మరొక దశలో 82.94 స్థాయికి పుంజుకున్నది. ఈ క్రమంలోనే చివరకు 83.03 వద్ద నిలిచింది. ఇక ఈ వారం మొత్తంగా రూపీ 37 పైసలు కోలుకున్నది. అమెరికా డాలర్ ఇండెక్స్ క్రితం ముగింపుతో పోల్చితే దాదాపు స్థిరంగా 101.01 వద్దే ఉన్నది. వచ్చే ఏడాది వడ్డీరేట్లను తగ్గిస్తామంటూ ఇటీవలి ద్రవ్యసమీక్షలో ఫెడ్ రిజర్వ్ ఇచ్చిన సంకేతాలు.. గురువారం పదేండ్ల అమెరికా ట్రెజరీ ఈల్డ్స్‌ను 4 శాతం దిగువ స్థాయికి కుంగదీశాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో 5 శాతానికి ఎగబాకిన విషయం తెలిసిందే. 2007 నుంచి ఇదే గరిష్ఠం.

## నిధుల వేటలో బీవోబీ

ముంబై, డిసెంబర్ 15: బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) భారీ స్థాయిలో నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. బాసెల్-3 బాండ్లను జారీ చేయడం ద్వారా గరిష్ఠంగా రూ.2,500 కోట్ల వరకు నిధులను సేకరించాలనుకుంటున్నది. ఈ నిధుల సేకరణకు క్యాపిటల్ రైజింగ్ కమిటీ అనుమతించింది. బాసెల్-3కి లోబడి జారీ చేస్తున్న టైర్-2 బాండ్ల సైజు రూ.1,000 కోట్లు కాగా, ఓవర్‌సబ్‌స్క్రిప్షన్ ద్వారా మరో రూ.1,500 కోట్లు సమీకరించనున్నది.

# ఎస్బీఐ వడ్డీరేట్ల పెంపు

### 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచిన సంస్థ



న్యూఢిల్లీ, డిసెంబర్ 15: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణగ్రహీతలకు షాకిచ్చింది. అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్ల వరకు సవరించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)తో అనుసంధానమైన అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లను పెంచిన బ్యాంక్..బేస్ రేటుని కూడా 15 బేసిస్ పాయింట్లు సవరించింది. పెరిగిన వడ్డీరేట్లు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయి. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో బేస్‌రేటు 10.10 శాతం నుంచి 10.25 శాతానికి చేరుకోగా, పలు రకాల కాలపరిమితులపై ఎంసీఎల్ఆర్ 8 శాతం నుంచి 8.85 శాతం మధ్యలోకి చేరుకున్నాయి. ఒక్కరోజు కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని యథాతథంగా ఉంచిన బ్యాంక్..మిగతా రుణాలపై రేటును 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. అలాగే బ్యాంక్ ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లింక్డ్ రేటుని సైతం 9.5 శాతం+సీఆర్పీ+బీఎస్పీ, ఆర్ఎల్ఎల్ఆర్‌ని 8.75 శాతం+సీఆర్పీగా నిర్ణయించింది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై వడ్డీరేట్లు మరింత పెరగనున్నాయి. రిజర్వ్‌బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ బ్యాంకులు మాత్రం వడ్డీరేట్లను క్రమంగా పెంచుతున్నాయి.

| కాల పరిమితి | పాత ఎంసీఎల్ఆర్ (శాతంలో) | కొత్త ఎంసీఎల్ఆర్ (శాతంలో) |
|---|---|---|
| ఒక్కరోజు | 8 | 8 |
| నెల | 8.15 | 8.20 |
| మూడు నెలలు | 8.15 | 8.20 |
| ఆరు నెలలు | 8.45 | 8.55 |
| ఏడాది | 8.55 | 8.65 |
| రెండేండ్లు | 8.65 | 8.75 |
| మూడేండ్లు | 8.75 | 8.85 |

### ప్రారంభ ధర రూ.4.59 లక్షలు



# యమహా సరికొత్త బైకులు

చెన్నై, డిసెంబర్ 15: ప్రముఖ వాహన సంస్థ యమహా..దేశీయ మార్కెట్‌కు మరో రెండు బైకులను పరిచయం చేసింది. రేసింగ్ ప్రియులు కోరుకుంటున్న విధంగా డిజైన్ చేసిన ఈ ఆర్3, ఎంటీ-03లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు కంపెనీ చైర్మన్ ఐషిన్ చిహానా తెలిపారు. 321 సీసీ లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌తో రూపొందించిన 4-స్ట్రోక్ కలిగిన ఈ బైకులో డౌన్ ఫ్రంట్ ఫోర్క్స్, ఎల్‌సీడీ క్లస్టర్, ఎల్ఈడీ హెడ్‌లైట్-ఇండికేటర్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. కొనుగోలుదారులకు పూర్తిగా మోటర్‌సైకిలింగ్ అనుభవం కల్గించేలా దీనిని తీర్చిదిద్దినట్టు...ముఖ్యంగా పనితీరు, రేసింగ్‌లో కొత్తదనం కల్పించినట్టు తెలిపారు. వీటిలో ఆర్3 మాడల్ ధర రూ.4,64,900గాను, ఎంటీ-03 మాడల్ రూ.4,59,900గా నిర్ణయించింది. ఈ బైకు కోసం https://www.yamaha-motor-india.com వెబ్‌సైట్‌లో ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ తెలిపింది.

# ఎగుమతుల్లో నిస్తేజం

***నవంబర్‌లో 3 శాతం తగ్గుదల • 20 బిలియన్ డాలర్లకు వాణిజ్యలోటు***



న్యూఢిల్లీ, డిసెంబర్ 15: దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. విదేశాల్లో దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పడిపోవడంతో గత నెలకుగాను ఎగుమతులు 2.83 శాతం తగ్గి 33.90 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఇదే నెలలో దేశీయ దిగుమతులు కూడా 4.33 శాతం తగ్గి 54.48 బిలియన్ డాలర్లకు తగ్గడం విశేషం. దీంతో వాణిజ్యలోటు(ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) 20.58 బిలియన్ డాలర్లుగా నమోదైనట్లు వెల్లడించింది. పెట్రోలియం ఉత్పత్తులు, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ, కెమికల్స్, వస్ర్తాలు, ఇంజినీరింగ్ గూడ్స్ విభాగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడంతో ఎగుమతులు నీరసించాయని పేర్కొంది. కానీ, ఎలక్ట్రానిక్స్, ఇనుప ఖనిజం, ఫార్మా రంగాలు ఆశాజనక పనితీరు కనబరిచాయి. గత నెలలో పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 6.24 శాతం తగ్గి 3.44 బిలియన్ డాలర్లకు చేరుకోగా, చమురు దిగుమతులు మాత్రం 8.47 శాతం తగ్గి 14.93 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అలాగే సర్వీసుల ఎగుమతులు 26.93 బిలియన్ డాలర్ల నుంచి 28.69 బిలియన్ డాలర్లకు చేరాయి.

*అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఎగుమతులు ఆశాజనకంగా ఉన్నాయి. దేశాల వృద్ధిరేటు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, వడ్డీరేట్లు, అంతర్గత విషయాలు ప్రభావం చూపుతున్నాయి.*

*- సునీల్ బర్థ్‌వాల్, వాణిజ్య కార్యదర్శి*

- *ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో ఎగుమతులు 6.51 శాతం తగ్గి 278.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది.*
- *అలాగే దిగుమతులు కూడా 8.67 శాతం దిగి 445.15 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంట్లో చమురు దిగుమతులు 139.29 బిలియన్ డాలర్ల నుంచి 113.65 బిలియన్ డాలర్లకు తగ్గడం కారణం. దీంతో వాణిజ్యలోటు 166.35 బిలియన్ డాలర్లుగా ఉన్నది.*
- *గత ఎనిమిది నెలల్లో 32.93 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతి అయ్యాయి. ఏడాది క్రితం అయిన దాంతో పోలిస్తే 21 శాతం అధికం.*
- *ఎలక్ట్రానిక్ గూడ్స్ దిగుమతులు కూడా 51.89 బిలియన్ డాలర్ల నుంచి 57.83 బిలియన్ డాలర్లకు పెరిగాయి.*

## గోల్డ్ బాండ్ ధర రూ.6,199

ముంబై, డిసెంబర్ 15: సావరిన్ గోల్డ్ బాండ్లను రిజర్వు బ్యాంక్ మళ్లీ జారీ చేసింది. సోమవారం నుంచి ఐదు రోజులపాటు అందుబాటులో ఉండనున్న ఈ బాండ్ల గ్రాము ధరను రూ.6,199గా నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను సిరీస్-3 జారీ చేస్తున్న ఈ బాండ్లు ఈ నెల 18 నుంచి 22 వరకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన బ్యాంకులతో(స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా) స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఎన్ఎస్ఈ, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్‌లలో కూడా లభించనున్నాయి. అలాగే ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపిన వారికి గ్రాముపై రూ.50 రాయితీ ఇస్తున్నది. 2023-24 ఏడాదికిగాను నాలుగోసారి బాండ్లను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి 16 వరకు విక్రయించనున్నారు.





వాల్యూ జోన్ హైపర్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ సినీహీరో బాలకృష్ణ. చిత్రంలో సంస్థ అధిపతులు టీ ప్రసాదరావు, పీ వెంకటేశ్వర్లు, ఎస్ రాజమౌళి తదితరులు

## హైదరాబాద్‌లో వాల్యూ జోన్ హైపర్ మార్ట్

### పటాన్‌చెరు వద్ద ప్రారంభించిన సినీహీరో బాలకృష్ణ

హైదరాబాద్, డిసెంబర్ 15: హైదరాబాద్‌లోనే మొట్టమొదటి అతిపెద్ద ఔట్‌లెట్ మాల్.. వాల్యూ జోన్ హైపర్ మార్ట్ శుక్రవారం పటాన్‌చెరులో ప్రారంభమైంది. వాల్యూ జోన్ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీహీరో నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా ఇది ఆవిష్కృతమైంది. నాణ్యమైన వస్తూత్పత్తులు ఆకర్షణీయమైన ధరలకే లభిస్తాయని, అన్ని వర్గాలకు నచ్చిన, కోరిన బ్రాండ్లు అందుబాటులో ఉంటాయని ఈ సందర్భంగా కంపెనీ వర్గాలు స్పష్టం చేశాయి. ఔటర్ రింగ్ రోడ్డుకు, జాతీయ రహదారికి సమీపంలో ఈ మాల్‌ను తీసుకొచ్చామన్న సంస్థ.. అమీర్‌పేటకు, ఐటీ కారిడార్‌కు కేవలం 20 నిమిషాల ప్రయాణ దూరంలో ఏర్పాటు చేశామని వివరించింది. 'రిటైల్ వ్యవస్థ చరిత్రలో వాల్యూ జోన్ ఓ సరికొత్త అధ్యాయం. వినూత్నమైన షాపింగ్ అనుభవాన్ని కొనుగోలుదారులు సొంతం చేసుకుంటారు. కస్టమర్ల అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఈ మాల్‌ను తెచ్చాం. వినియోగదారుల అన్ని అవసరాలు ఇక్కడ తీరుతాయి. సువిశాలమైన స్థలంలో ఏర్పాటు చేశాం' అని సంస్థ డైరెక్టర్లు సురేశ్ సీర్ణ, పీవీఎస్ అభినవ్, టీ రాకేశ్, టీ కేశవ్ గుప్తాలు అన్నారు.



కేంద్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి నారాయణ్ రాణేతో సమావేశమైన పతంజలి సీఈవో ఆచార్య బాలకృష్ణ

# పీఎస్‌యూల విలువ రెట్టింపు

### సెన్సెక్స్ 10కే రన్‌లో ప్రభుత్వ సంస్థల దూకుడు
### అదానీలు, అంబానీలను మించి పరుగు



న్యూఢిల్లీ, డిసెంబర్ 15: సెన్సెక్స్ 71,000 పాయింట్ల మార్క్‌ను అధిగమించడంలో టాటాలు, అంబానీలు, ఆదానీలకంటే ప్రభుత్వ రంగ కంపెనీలు, ప్రభుత్వ బ్యాంక్‌లు ప్రధాన పాత్ర పోషించాయి. ముఖ్యంగా 60,000 పాయింట్ల నుంచి 70,000 పాయింట్లకు జరిగిన 10కే రన్‌లో ప్రభుత్వ రంగ సంస్థల మార్కెట్ విలువ రెట్టింపుకావడం విశేషం. 2021 సెప్టెంబర్‌లో సెన్సెక్స్ తొలిసారిగా 60 వేల స్థాయిని తాకింది. ఇది 70 వేలకు చేరడానికి రెండేండ్ల రెండు నెలలు (551 ట్రేడింగ్ సెషన్లు) పట్టింది. ఈ మధ్యకాలంలో పీఎస్‌యూల మార్కెట్ విలువ రెట్టింపై డిసెంబర్ 14 నాటికి రూ.46.4 లక్షల కోట్లకు చేరింది. వీటి విలువ 129 శాతం పెరిగింది. ఇదే సమయంలో అదానీ గ్రూప్ కంపెనీల విలువ 46.9 శాతం పెరిగి రూ.14.37 లక్షల కోట్లను అందుకోగా, ముకేశ్ అంబానీ రిలయన్స్ గ్రూప్ సంపద 10.3 శాతం చొప్పున వృద్ధిచెంది రూ.18.61 లక్షల కోట్లకు చేరింది. టాటా గ్రూప్ సంస్థలు విలువ 33.7 శాతం ఎగిసి రూ.27.40 లక్షల కోట్లకు చేరింది. వీటిలో అన్నింటి కంటే అధికంగా ఎస్బీఐ మార్కెట్ విలువ రూ.5.78 లక్షల కోట్లకు చేరుకోగా, తర్వాతి స్థానాల్లో ఎల్ఐసీ (రూ.5.5 లక్షల కోట్లు), ఓఎన్‌జీసీ, ఎన్టీపీసీ, కోల్ ఇండియా, పవర్‌గ్రిడ్‌లు ఉన్నాయి.

### టాప్-5 గ్రూప్‌లు

| గ్రూప్ | 2023 డిసెంబర్ 14న మార్కెట్ విలువ (రూ.కోట్లలో) | 2021 సెప్టెంబర్ 24 నుంచి వృద్ధి శాతం |
|---|---|---|
| పీఎస్‌యూలు | 46,44,557 | 129.9 |
| టాటా గ్రూప్ | 27,40,887 | 33.7 |
| రిలయన్స్ గ్రూప్ | 18,61,389 | 10.3 |
| అదానీ గ్రూప్ | 14,37,439 | 46.9 |
| బజాజ్ గ్రూప్ | 10,40,820 | 8.6 |

# రూ.398కే జియోటీవీ ప్రీమియం ప్రీపెయిడ్ ప్లాన్లు

### ఆకర్షణీయమైన ఆఫర్లతో పరిచయం




న్యూఢిల్లీ, డిసెంబర్ 15: జియోటీవీ ప్రీమియం ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్లను ప్రకటించింది. రకరకాల బండిల్స్‌తో రూ.398, రూ.1,198, రూ.4,498 ధరల్లో వీటిని తీసుకొచ్చింది. శుక్రవారం నుంచే సబ్‌స్కైబర్స్‌కు అందుబాటులోకి వచ్చాయి. కాగా, ఈసారి ప్రప్రథమంగా జియోటీవీ ప్రీమియం వెర్షన్‌ను పరిచయం చేసింది. ఇప్పటిదాకా ఇది ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ మొబైల్ ప్లాన్లతో ఉచిత యాడ్-ఆన్‌గానే లభిస్తుండటం గమనార్హం.

**సింగిల్ లాగిన్‌తో..**

సింగిల్ లాగిన్‌తోనే 14 ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కు జియోటీవీ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌తో అనుమతి వస్తున్నది. ఈ ఓటీటీల్లో జియోసినిమా ప్రీమియం, డిస్నీ+ హాట్‌స్టార్, జీ5, సోనీలివ్, ప్రైమ్ వీడియో (మొబైల్), లయన్స్‌గేట్ ప్లే, డిస్కవరీ+, డుకుబే, హొయ్‌చాయ్, సన్‌నెక్స్ట్, ప్లానెట్ మరాఠీ, చౌపల్, ఎపిక్ ఆన్, కంచా లంకా ఉన్నాయి. తాము ఎంచుకున్న ప్లాన్‌తో అనుసంధానమైన తమ మొబైల్ నెంబర్లను వినియోగించి యూజర్లు సైన్ ఇన్ చేసుకోవచ్చు. అయితే డిస్నీ+ హాట్‌స్టార్, ప్రైమ్ వీడియో (మొబైల్)లను మాత్రం వాటి సంబంధిత ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే యాక్సెస్ చేసుకోవాల్సి ఉంటుంది.

**ప్లాన్ ధర:** రూ.398
**చెల్లుబాటు కాలం:** 28 రోజులు
**ప్రయోజనాలు:** రోజుకు 2జీబీ డాటా, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 12 జియోటీవీ ప్రీమియం ఓటీటీలు

**ప్లాన్ ధర:** రూ.1,198
**చెల్లుబాటు కాలం:** 84 రోజులు
**ప్రయోజనాలు:** రోజుకు 2జీబీ డాటా, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 14 జియోటీవీ ప్రీమియం ఓటీటీలు

**ప్లాన్ ధర:** రూ.4,498
**చెల్లుబాటు కాలం:** ఏడాది
**ప్రయోజనాలు:** రోజుకు 2జీబీ డాటా, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, 14 జియోటీవీ ప్రీమియం ఓటీటీలు. ప్రాధాన్యత కస్టమర్ కేర్, మైజియో యాప్ వోచర్ సెక్షన్ ద్వారా అందుబాటులో జియో సినిమా ప్రీమియం కూపన్. ఈ ప్లాన్‌ను కొనడానికి సబ్‌స్క్రైబర్లకు ఈఎంఐ సదుపాయం కూడా ఉన్నది.

**డాటా యాడ్-ఆన్ వోచర్**
**ప్లాన్ ధర:** రూ.148
**చెల్లుబాటు కాలం:** 28 రోజులు
**ప్రయోజనాలు:** 10జీబీ డాటా, 12 జియోటీవీ ప్రీమియం ఓటీటీలు

## పెరిగిన ఫారెక్స్ రిజర్వులు



ముంబై, డిసెంబర్ 15: ఫారెక్స్ రిజర్వులు భారీగా పుంజుకున్నాయి. ఈ నెల 8తో ముగిసిన వారంలో విదేశీ మారకం నిల్వలు 2.816 బిలియన్ డాలర్లు పెరిగి 606.859 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 6.107 బిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ అంతకంతకు పెరగడం వల్లనే రిజర్వులు అధికమయ్యాయని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.089 బిలియన్ డాలర్లు అధికమై 536.699 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు తెలిపింది. పసిడి రిజర్వులు 199 మిలియన్ డాలర్లు కరిగిపోయి 47.13 బిలియన్ డాలర్లకు చేరాయి.




## సెలెక్ట్‌లో రియల్‌మీ సీ67

హైదరాబాద్, డిసెంబర్ 15: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెలెక్ట్ షోరూంలలో రియల్‌మీ సరికొత్త 5జీ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ స్టోర్‌లో సినీనటి శివానీ రాజశేఖర్ ఈ ఫోన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ రేతినేని మాట్లాడుతూ..కొత్త టెక్నాలజీ, కొత్త మాడళ్లను ప్రవేశపెట్టడంలో ఎల్లప్పుడూ సెలెక్ట్ మొబైల్స్ ముందువరుసలో ఉంటుందన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ తాజాగా రియల్‌మీ సీ67 5జీని కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో ఉన్న సెలెక్ట్ స్టోర్లలో ఈ ఫోన్ లభించనున్నదన్నారు. 6.72 ఇంచుల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే కలిగిన ఈ 5జీ ఫోన్లో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, మీడియాటెక్ డైమన్‌సిటీ 6100 ప్లస్, ఆక్టా కోర్, 2.2 గిగాహెర్ట్జ్ ప్రాసెసర్, 50+2 మెగాపిక్సెల్ కెమెరా, ముందు భాగంలో 8 మెగాపిక్సెల్ కెమెరా, 4జీబీ+128జీబీ/6జీబీ+128జీబీ కెపాసిటీతో లభించనున్నది. ఈ ఫోన్ ధర రూ.13,999గా నిర్ణయించింది.

### చరిత్ర సృష్టించిన సూచీలు




# మార్కెట్లో రికార్డుల హోరు

ముంబై, డిసెంబర్ 15: వరుస ర్యాలీలతో అదరగొడుతున్న భారత్ ప్రధాన స్టాక్ మార్కెట్ శుక్రవారం రికార్డులతో హోరెత్తించింది. రెండు ప్రధాన సూచీలతో పాటు పలు హెవీవెయిట్ షేర్లు చరిత్రాత్మక రికార్డుస్థాయిలకు చేరాయి. మార్కెట్ సంపదలోనూ కొత్త రికార్డు నెలకొంది. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో శుక్రవారం సెన్సెక్స్ ఇంట్రాడేలో 71,605 నూతన రికార్డుస్థాయికి చేరింది. చివరకు 969 పాయింట్లు లాభపడి 71,484 పాయింట్ల వద్ద ముగిసింది. మరో ప్రధాన సూచి ఎన్ఎస్ఈ నిఫ్టీ ఇంట్రాడేలో కీలకమైన 21,500 స్థాయిని సమీపించిన అనంతరం 274 పాయింట్ల భారీ లాభంతో 21,457 పాయింట్ల వద్ద నిలిచింది. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆర్థిక సంస్కరణలు కొనసాగుతాయన్న అంచనాలు, వడ్డీ రేట్ల తగ్గుదలకు అమెరికా ఫెడ్ సంకేతాలివ్వడం, యూఎస్ బాండ్ ఈల్డ్స్, క్రూడ్ ధరలు తగ్గడంతో ఎఫ్‌పీఐల పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని, ఈ నేపథ్యంలో మార్కెట్ అలుపెరుగని ర్యాలీ సాగిస్తున్నదని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే చెప్పారు. మార్కెట్‌లో బుల్స్ ఆధిపత్యం చెలాయిస్తున్నారని, దీంతో వరుసగా ఏడోవారమూ ఇండెక్స్‌లు లాభాల్లో ముగిసాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ రూపక్ డే తెలిపారు. యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ సర్వీసులకు డిమాండ్ పెరుగుతుందన్న అంచనాలతో ఐటీ ఇండెక్స్ పరుగులు తీసిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

**ఐటీ స్టాక్స్, ఎస్బీఐ ఆల్‌టైం హై..**

మార్కెట్ల ర్యాలీకి ఐటీ షేర్లు, ఎస్బీఐలు నేతృత్వం వహించాయి. సెన్సెక్స్ షేర్లలో అన్నింటికంటే అధికంగా 5.58 శాతం పెరిగిన హెచ్‌సీఎల్ టెక్ ఆల్‌టైం రికార్డుస్థాయి రూ.1,490 వద్ద ముగిసింది. టీసీఎస్ సైతం 5.6 శాతం మేర పెరిగి కొత్త గరిష్ఠస్థాయి రూ.3,870 వద్దకు చేరింది. బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం ఇదే బాటలో 3.95 శాతం జంప్‌చేసి రికార్డుస్థాయి రూ.648 వద్ద నిలిచింది. కొత్త రికార్డులు సృష్టించిన షేర్లలో లార్సన్ అండ్ టుబ్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీలు ఉన్నాయి. వివిధ రంగాల సూచీల్లో ఐటీ ఇండెక్స్ 4.41 శాతం, టెక్నాలజీ ఇండెక్స్ 3.64 శాతం చొప్పున ర్యాలీ జరిపాయి. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీ సూచీలు 1.78 శాతం, 1.43 శాతం, 1.38 శాతం చొప్పున పెరిగాయి. యుటిలిటీస్, ఆటో సూచీలు 0.67 శాతం, 0.48 శాతం చొప్పున పెరిగాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, రియల్టీ, సర్వీసుల సూచీలు తగ్గాయి.

### 3 రోజుల్లో రూ.8 లక్షల కోట్లు

మూడు రోజులపాటు జరుగుతున్న వరుస ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద రూ.8 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.8,11,802 కోట్లు పెరిగి రూ.3,57,87,999 కోట్లకు చేరింది.

### ఎఫ్‌పీఐల దన్నుతో ఒక్క రోజులోనే బిలియన్ డాలర్లు

శుక్రవారం దూకుడుగా జరిగిన ర్యాలీకి ప్రధాన కారణం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) భారీ పెట్టుబడులే కారణం. ఈ రోజున వారు రూ.9,239 కోట్లు (1.11 బిలియన్ డాలర్లు) స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీల తాజా గణాంకాలు వెల్లడస్తున్నాయి. ఇదే సమయంలో దేశీయ ఫండ్స్ రూ.3,077 కోట్లు మార్కెట్ నుంచి వెనక్కు తీసుకున్నాయి. డిసెంబర్‌నెలలో ఇప్పటివరకూ ఎఫ్‌పీఐలు ఒక్కో ట్రేడింగ్ రోజుకు సగటున రూ.4,000 చొప్పున ఈక్విటీల్లో పెట్టుబడి చేశారు.